కథ



# బేరం


ఆంగ్లమూలం: జుయ్ చిత్రే

అనువాదం: కొల్లూరి సోమశంకర్


**ముంబయి శివారు ప్రాంతాలలో షాపింగ్ మాల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆదివారం పూట తమ సాయంత్రాలు ఇలాంటి మాల్‌లో గడిపే అనేకమంది ముంబయి వాసుల్లో నేనూ ఒకదాన్ని. అవసరం లేకపోయినా, ఏదో ఒకటి కొనుక్కోడం, ఇంటికి మోసుకొచ్చుకోడం అలవాటైపోయింది.**

నిన్న సాయంత్రం మాల్‌లో రకరకాల వస్తువులు, వాటి ధరలు, బ్రాండులు వగైరాలన్నీ పరిశీలించాక, ఇల్లు చేరాను. ఈరోజు నా మామూలు దినచర్య ప్రారంభమైంది. ఎప్పటిలాగే, ఆఫీసుకు వెళ్ళేందుకు లోకల్ ట్రైన్ ఎక్కాను. ఓ గంట ప్రయాణం! సీటు సంపాదించుకోడానికీ లేదా సౌకర్యంగా నిలబడే స్థలం సాధించుకోడానికి నా తోటి ప్రయాణీకులు ఒకరినొకరు తోసుకుంటున్నారు, నెట్టుకుంటున్నారు. అందరికంటే ముందుగా, రద్దీగా ఉన్న ఆ బోగీలోకి ఎక్కాలని ప్రయత్నిస్తున్నారు.

నాకీ తోపులాటలో రైలెక్కాలంటే విసుగు. ఇలాంటి వాళ్ళంతా ఎక్కాక తీరికగా ఎక్కడం ఇష్టం. రైలులో ప్రయాణం చేస్తుంటే నాకు రెండు కొత్త అలవాట్లు వంటబట్టాయి. మొదటిది బోగీ తలుపు దగ్గరగా నిలుచుని చల్లగాలిని ఆస్వాదించడం, రెండోది- సాటి ప్రయాణీకుల కబుర్లపై ఓ చెవేసి ఉంచడం!

ఈరోజు నేను ఎప్పటిలాగే నా తోటి ప్రయాణీకుల సంభాషణలు వింటూ, వాళ్ళ చేతలను గమనించసాగాను. నా చూపులు బోగీలోని ప్రయాణీకులందరి ముఖాలపై ప్రసరించి, ఓ బోసినవ్వు ముఖం వద్ద ఆగిపోయాయి. ఆమె 'చేతిసంచులు' అమ్ముకునే ఓ ముదుసలి. ఆమెని మరింతగా గమనించసాగాను. మా లేడీస్ కంపార్ట్‌మెంట్‌లోని మహిళలు తన చేతి సంచులని అమ్మకానికి ఆ ముసలామె చేస్తున్న ప్రయత్నాలను పట్టించుకోకుండా తమ తమ కబుర్లలో మునిగిపోయారు. అయితే ఆమె ఏమాత్రం నిరాశ చెందకుండా, చిరునవ్వుతో ప్రయత్నించసాగింది. కాసేపయ్యాక మా తోటి ప్రయాణీకులలో కొందరు ఆమె అమ్మజూపుతున్న చేతిసంచులపై ఆసక్తి చూపించారు. వాళ్ళంతా కాస్మోపాలిటన్ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నారు. మడతలు నలగని చీరలు, సల్వార్ స్యూట్లు ధరించి ఉన్నారు. ఆమె దగ్గరున్న చేతిసంచులన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత, వాటి ధర అడిగారు. కాని ఈ తతంగం అంతా అయ్యే సరికి, వాళ్ళు ఒక్కో చేతి సంచి ధర సుమారుగా పది రూపాయలు ఉండొచ్చని ఊహించారు. సాయంత్రం ఇళ్ళకి వెళ్ళేప్పుడు వాటిల్లో ఆకుకూరలు సులువుగా తీసుకుని వెళ్ళొచ్చు. కాని ఎవరూ కొనలేదు. కొంతమంది గీచిగీచి బేరమాడి, చివరికి అంతగా పనికిరాని ఆ చేతిసంచి ధర ఎక్కువని, కొనకూడదని నిశ్చయించుకున్నారు.

అయితే ఇది ముసలామె ముఖంపై చిరునవ్వుని తొలగించలేకపోయింది. బోగీ అంతా తిరుగుతూ, కబుర్లు చెప్పుకుంటున్న ప్రతీ గుంపుని అడిగింది. కాని ఒక్క సంచి కూడ అమ్ముడుపోలేదు. దాని ధర వినగానే వాళ్ళు విస్మయానికి గురయ్యారు. వాళ్ళ ముఖాలు వాడిపోయాయి. ముసలామె విపరీతమైన ధర చెబుతోందని భావించారు. కొందరేమో అది అంత ధర ఉండదని వాదించారు. మరి కొందరు తగ్గించి అమ్మమని అడిగారు. ఇంకొందరు తాము చెప్పిన ధరకే అమ్మాలని ఒత్తిడి చేసారు. పెద్ద పెద్ద కొట్లలో తమకి అక్కరలేని వస్తువులని సైతం అధిక ధరలకు కొనుగోలు చేసే వీళ్ళ ధోరణి నాకు విచిత్రంగా తోచింది.

నా ప్రయాణం ముగియ వచ్చింది. నేను ముడుతలు పడ్డ ఆ ముసలామె ముఖాన్ని చూడలేకపోతున్నాను. ఆమె కళ్ళలో తాను గెలవగలననే నమ్మకం ఇంకా సడలలేదు. బహుశా ఆమె గతంలో ఎన్నోసార్లు ఓడిపోయి ఉండచ్చు కూడ!

గట్టిగా కేకవేసి ఆమెని పిలిచాను- నాకో సంచి కావాలంటూ!

ఆమె ముఖం వెలిగిపోయింది. ఎంతో సంతోషంతో, తాను స్వయంగా కుట్టిన ఆ రంగు రంగుల చేతి సంచులను వర్ణిస్తూ, నాకు చూపించసాగింది. నా భావోద్వేగాలను అణచుకోడం నాకు కష్టమైంది. ఒక ఎర్రటి సంచి తీసుకుని, పది రూపాయల నోటు ఆమె చేతిలో పెట్టాను.

ఇది అక్కరలేని బేరం ఏమాత్రం కాదని నా మనసు చెబుతోంది. •